సాక్షి ప్రకాశం

శుక్రవారం । 17 । జనవరి । 2025



కుప్పకూలిన కూలీల కుటుంబాలు

ట్రాక్టర్ ట్రాలీ వెనుక వైపు ఉన్న డోర్ కమ్మీలు ఊడిపోవడంతో డోర్ కిందపడి దానిపై కూర్చున్న ఐదుగురు కూలీలు రోడ్డుపై పడి ఇద్దరు మృతిచెందారు. - 8లో..



ఉసురు తీసిన ఈత సరదా

స్నేహితులతో కలిసి నీటిగుంతలో ఈతకు దిగిన 12 ఏళ్ల బాలుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన పామూరు మండలం నుచ్చుపొదలో జరిగింది. - 8లో..

గరిష్టం/కనిష్టం
30/22

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు మైనంపాడు విద్యార్థులు

సంతనూతలపాడు: మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీడీ కే.వనజ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 17 నుంచి 19 వరకు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీఈటీ తిరుమల శెట్టి రవికుమార్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్ని, పీఈటీ రవికుమార్ ను హెచ్ఎం డీవీఎల్ నరసింహారావు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం ఓబుల్, హాకీ క్లబ్ మైనంపాడు అధ్యక్షుడు గొడుగు కాలేషా, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, హాకీ క్లబ్ మైనంపాడు వైస్ ప్రెసిడెంట్ సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


ఇండస్ట్రియల్ నోడ్స్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ఇండస్ట్రియల్ నోడ్స్ అభివృద్ధికి సంబంధిత జిల్లాల కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీఐఐసీ ఎండీ ఎం.అభిషిక్త్ కిషోర్ కలెక్టర్లకు సూచించారు. గురువారం మంగళగిరి నుంచి ఆయన జిల్లా కలెక్టర్లతో వర్చువల్‌గా సమావేశమై ఇండస్ట్రియల్ నోడ్స్ అభివృద్ధికి సంబంధించిన భూసేకరణ ప్రక్రియ పై జిల్లాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలో దొనకొండ, పామూరు ప్రాంతాల్లో చేపట్టనున్న భూసేకరణ వివరాలను ఏపీఐఐసీ ఎండీ కి వివరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టరు ఆర్.గోపాలక్రిష్ణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మదన్ మోహన్ పాల్గొన్నారు.

తర్లుపాడు హైస్కూల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు



ప్రశంస పత్రం అందుకుంటున్న హెచ్ఎం సుధాకర్

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయంతో చేసిన అభివృద్ధికి గాను జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకూ న్యూఢిల్లీలో ఎన్ఐఈపీఏ, ఎన్ఎస్‌సీఎల్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి సమావేశంలో పూర్వ విద్యార్థుల అభివృద్ధి కార్యక్రమాలతో ప్రదర్శించిన డాక్యుమెంటరీ, లఘు చిత్రం పలువురి అధికారుల ప్రశంసలు అందుకుంది. భారత దేశ స్థాయిలో పాఠశాలల నాయకత్వాన్ని పెంపొందించేందుకు కొన్ని సంవత్సరాలుగా ఎన్ఐఈపీఏ, ఎన్ఎస్‌సీఎల్ ఆధ్వర్యంలో పాటుపడుతున్నట్లు హెచ్ఎం సుధాకర్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఐఈపీఏ వైస్ ఛాన్సలర్ చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం ఎం.సుధాకర్ ప్రశంసపత్రం అందుకున్నారు. పూర్వ విద్యార్థుల సహకారంతో ఈ ఘనత సాధించినట్లు ఆయన తెలిపారు.

వైఎస్సార్ టీప డైరీ, క్యాలెండర్ అందజేత



జిల్లా ఖజానాధికారికి డైరీ, క్యాలెండరు అందజేస్తున్న వైఎస్సార్ టీప నాయకులు

ఒంగోలు సిటీ: ఆంధ్రప్రదేశ్ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ 2025 డైరీ, క్యాలెండరు ను ప్రకాశం జిల్లా అధ్యక్షుడు మట్టిగుంట మహేశ్వరరావు ఆధ్వర్యంలో జిల్లా ఖజానా అధికారి, అడ్మినిస్ట్రేటివ్ అధికారి జగన్నాథరావు ను కలిసి మర్యాద పూర్వకంగా అందించారు. అనంతరం జెడ్పీ కార్యాలయంలో ఏఓ శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీ సెక్షన్‌లో ఏసీ, ఏపీ జీఎల్ఐ ఏడీ తరపున ప్రసన్నాంజనేయులు లకు వైఎస్సార్‌టీప నాయకులు డైరీ క్యాలెండరు, స్టిక్కర్లను గురువారం అందించారు. కార్యక్రమంలో ఏపీ వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర శాఖ గౌరవ అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మట్టిగుంట మహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పర్వతం రమణారెడ్డి, కోశాధికారి కృష్ణప్రసాద్, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు పల్లప్రోలు శేషిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు రోజులపాటు సంక్రాంతి సంబరాల్లో మునిగితేలారు. అదే ఉత్సాహంతో పాకల సముద్రతీరానికి వెళ్లారు.. అది వారిపాలిట యమపాశమైంది. తీరంలో అలలపై తేలియాడుతూ కేరింతలు కొట్టిన వారిలో కొందరు నిమిషాల్లో విగతజీవులుగా మారిపోయారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. కెరటాల నడుమ సరదాగా సందడి చేస్తున్న వారు తమ కళ్లెదుటే నిర్జీవంగా మారి మృత్యుకౌగిట్లోకి చేరడాన్ని చూసిన బంధువులు చలించిపోయారు. బోరున విలపిస్తుండడంతో పాలక తీరం కన్నీటి సంద్రంగా మారింది. సంక్రాంతి పండుగ సందడి ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

ప్రమాదానికి ముందు దిగిన గ్రూప్ ఫొటో



కందుకూరు హాస్పిటల్‌లో రోదిస్తున్న యామిని తల్లి సంపూర్ణ



కన్నీటి తీరం..

- పాకల తీరంలో ఘోరం
- రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం
- పోస్టుమార్టం నిమిత్తం కందుకూరు ఆస్పత్రికి మృతదేహాలు
- ఆస్పత్రిలో మిన్నంటిన కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు
- శివన్నపాలెం, కొల్లగుంటల్లో విషాదం

పండుగ సంబరం నిమిషాల్లో ఆవిరై.. సముద్రంలో మునిగి ఇద్దరు బాలికలు, యువకుడి మృతి



మాధవ (ఫైల్), యామిని (ఫైల్), జెస్సికా (ఫైల్)



విషాదంలో విశాల్, అతని స్నేహితులు



విలపిస్తున్న జెస్సికా తల్లిదండ్రులు

పొన్నలూరు/సింగరాయకొండ/కందుకూరు:

పొన్నలూరు మండలం తిమ్మపాలెం పంచాయతీ శివన్నపాలెం ఎస్సీ కాలనీకి చెందిన శింగయ్య, వరమ్మ దంపతుల కుమారుడు నోసిన మాధవ (25)కు కందుకూరు మండలం అనంతసాగరం గ్రామానికి చెందిన కొండాబత్తిన సురేష్, సంపూర్ణ దంపతుల రెండో కుమార్తె నవ్యతో ఆరు నెలల కిందట వివాహమైంది. మాధవ హైదరాబాద్‌లో బేల్దారి పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో సంక్రాంతి పండుగ వేడుకల కోసం ఇటీవల స్వగ్రామమైన శివన్నపాలెం వచ్చాడు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ఉత్సాహంగా జరుపుకున్నారు. వేడుకల్లో భాగంగానే గురువారం ఉదయం సింగరాయకొండ మండలం పాకల బీచ్‌కు వెళ్లేందుకు నిర్ణయించుకున్నారు. కుటుంబ సభ్యులతో పాటు, గ్రామంలోని బంధువులు అంతా కలిసి అశోక్ లేలాండ్ టెంపో ఆటోను మాట్లాడుకున్నారు. దారిలో నవ్య చెల్లెలు, తమ్ముడు యామిని, ఫణీంద్రలను ఆటోలో ఎక్కించుకున్నారు. మొత్తం 15 మందికి పైగా పాకల తీరానికి చేరుకున్నారు. వెళ్లిన వారంతా సముద్రంలో మునుగుతూ చాలాసేపు ఉత్సాహంగా కెరటాలపై సందడి చేశారు. అయితే శ్రుతిమించిన ఉత్సాహమే వారిపాలిట శాపంగా మారింది. ఈ క్రమంలో కొందరు ఇంకా కొంచెం లోతైన ప్రాంతానికి వెళ్లారు. అంతే వారిలో ఐదుగురిని సముద్రపు అలలు లాక్కెళ్లిపోయాయి. వీరిలో నోసిన మాధవ (25), కొండాబత్తిన యామిని (14), నోసిన జెస్సికా(13) ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, మరో ఇద్దరు త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. దీంతో వీరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గురువారం సాయంత్రం కందుకూరు ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అక్కడికి చేరిన మృతుల బంధువులు, కుటుంబ సభ్యుల ఆర్తనాదాలతో హాస్పిటల్‌లో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది. అదే విధంగా సింగరాయకొండ శ్రీరాంనగర్ ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి పవన్ (22) కూడా తన స్నేహితులతో కలిసి సముద్ర స్నానం చేసేందుకు వచ్చాడు. అలల ఉధృతికి పవన్ సముద్రంలో కొట్టుకుపోవడంతో అతని కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ దొరకలేదు.

రెండు గ్రామాల్లో విషాద ఛాయలు...

సముద్ర స్నానానికి వెళ్లి మాధవ, యామిని, జెసికా మృతి చెందడంతో శివన్నపాలెం, కొల్లగుంట గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. నిన్నటి వరకు తమతో కలిసి సంక్రాంతి పండుగను సంతోషంగా జరుపుకున్న వారు ఈ విధంగా మృత్యువాత పడడంపై బంధువులు, గ్రామస్తులు రోదిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందడంతో బంధువులు, గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఒక పక్క భర్త..మరో వైపు చెల్లెలు

ఇదే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కొండాబత్తిన యామిని.. నవ్యకు సొంత చెల్లెలు. ప్రస్తుతం పొన్నలూరు మండలంలోని విప్పగుంట హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. పండుగ సెలవులు కావడంతో ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో అక్కా, బావ బీచ్‌కు వెళ్తూ మార్గమధ్యంలోనే ఉన్న యామినిని, ఆమె తమ్ముడు ఫణీంద్రను ఆటో ఎక్కించుకుని బీచ్‌కు తీసుకెళ్లారు. అందరూ కలిసి సముద్రం మునుగుతున్న సమయంలోనే యామిని అలల ధాటికి కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయింది. దీంతో ఒకపక్క భర్త మాధవ, మరోపక్క చెల్లెలు యామిని.. నవ్య కళ్లెదుటే ప్రాణాలు కోల్పోయారు. దీంతో హాస్పటల్‌కు చేరుకున్న నవ్య తల్లిదండ్రులు సురేష్, సంపూర్ణలు అల్లుడు, కుమార్తెల మృతదేహాలను చూసి బోరున విలపించారు. ఇదే ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన జెస్సిక కుటుంబంలోను తీవ్ర విషాదంగా మారింది. శివన్నపాలెం గ్రామానికే చెందిన మంగయ్య, సువర్ణరాణిల కుమార్తె జెసిక. ప్రస్తుతం మాలపాడు కేజీబీవీ స్కూల్‌లో 8వ తరగతి చదువుతోంది. తల్లిదండ్రులతో కలిసి సముద్ర స్నానానికి వెళ్లారు. సముద్రంలో మునుగుతున్న సమయంలోనే జెస్సిక నీట మునిగి ప్రాణాలు కోల్పోయింది. కళ్ల ఎదుటే కుమార్తె కొట్టుకుపోతుంటే ఏమీ చేయలేని దీనస్థితి ఆ తల్లిదండ్రులది.

బాత్‌రూంకు వెళ్లి వచ్చే లోపే... వెంకటేష్ ప్రత్యక్ష సాక్షి

మేము దాదాపు 20 మంది వరకు పాకల బీచ్‌కు వెళ్లాము. అంతా కలిసి చేతులు చేతులు పట్టుకుని మునుగుతున్నాం. మునిగే క్రమంలో బాత్ రూంకు అని నేను ఒడ్డుకు వచ్చాను. ఒడ్డుకు వచ్చి మళ్లీ వెళ్లే లోపే మాలో కొంత మంది సముద్రంలో కొట్టుకుపోయారు. ఆ సమయంలో ఏమీ చేయలేని పరిస్థితి. తరువాత స్థానికంగా ఉండే మత్స్యకారులతో మాట్లాడి బోట్లు వేసుకుని సముద్రంలోకి కొట్టుకుపోయిన వారి కోసం వెతికాము. ఇలా వెతుకుతుంటేనే మాధవ, యామిని, జెస్సికా మృతదేహాలు మాకు దొరికాయి. వీరిని పడవలో బయటకు తీసుకొచ్చాం. నాలు గైదు నిమిషాల సమయంలోనే ఇంత ఘోరం జరుగుతుందని ఊహించలేదు.



భర్త మృతి...భార్య సేఫ్

ప్రమాదంలో మృతి చెందిన మాధవకు, నవ్యతో ఆరు నెలల కిందట వివాహమైంది. వివాహ అనంతరం తొలి పండుగ కావడంతో సంక్రాంతి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. ఈ క్రమంలోనే భార్య నవ్యతో కలిసి సరదాగా సముద్రంలో మునుగుతున్న సమయంలో అలల ధాటికి మాధవ సముద్రంలో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. అయితే భర్త పక్కనే ఉన్న నవ్య మాత్రం త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడింది. అయితే పెళ్లి ముచ్చట కూడా తీరక ముందే తన కళ్ల ఎదుటే భర్తను కోల్పోయిన నవ్య ప్రస్తుతం ఒంటరైంది.



నవ్య, మాధవ (ఫైల్)

గల్లంతైన పవన్ ఎక్కడ..?

ఒక్కగానొక్క కొడుకు గల్లంతయ్యాడన్న సమాచారంతో బరువెక్కిన గుండెతో తీరంలో ఏం చేయాలో అర్థంగాక తమ కొడుకు ఎప్పుడు బయటకు వస్తాడా అని ఎదురుచూపులు చూస్తూ ఆ తల్లి దండ్రులు రోదించడం చూపరులను కలచివేసింది. పవన్ తండ్రి కూలి పని చేస్తూ జీవిస్తుంటాడు. పవన్ ఇటీవల డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ వేటలో ఉన్నాడు. గురువారం తన స్నేహితులతో కలిసి ఇంట్లో వారికి చెప్పకుండా పాకల బీచ్‌కు సరదాగా గడపటానికి వచ్చాడు. కానీ, తీరానికి వచ్చిన కొద్ది సేపటికే రాకాసి అలల ధాటికి లోనికి కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. మెరైన్ పోలీసులు మత్స్యకారుల సహకారంతో బోట్లు వేసుకుని పవన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

బాధితులను పరామర్శించిన మంత్రి, ఎస్పీ

పాకల బీచ్‌లో సముద్రంలో మునిగి చనిపోయిన మృతుల కుటుంబ సభ్యులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డొక్కా బాలవీరాంజనేయస్వామి, ఎస్పీ ఏఆర్ దామోదర్, కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గురువారం సాయంత్రం కందుకూరు ఏరియా హాస్పటల్‌లో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును ప్రత్యక్ష సాక్షులను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన వారంతా మృతి చెందడం బాధాకరమని విచారం వ్యక్తం చేశారు.



పాకల తీరంలో పరిస్థితిని సమీక్షిస్తున్న ఎస్పీ దామోదర్

ప్రోటోకాల్ అయితే మాకేంటి..

- ప్రోటోకాల్ ఉల్లంఘించిన కూటమి ప్రభుత్వం
- 'స్వామి' భక్తితో అధికారులు నిబంధనల బేఖాతరు
- శంకుస్థాపనలు, అభివృద్ధి శిలాఫలకాల్లో కనిపించని రాజ్యసభ సభ్యుడి పేరు
- కూటమి నాయకుల సేవల్లో తరిస్తున్న అధికారులు

ఒంగోలు సిటీ:

ఏ రాజకీయ పార్టీ అయినా ఎన్నికల వరకే రాజకీయాలు చేసుకోవాలి. కానీ కూటమి అధికార పార్టీ మాత్రం ఎన్నికలు అయిపోయిన తర్వాత కూడా ప్రతిపక్షాలపై, ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపులకు దిగుతూ వారిని ఇబ్బంది పెడుతోంది. చట్టసభల్లో ఎంపికైన రాజకీయ నాయకుల ప్రోటోకాల్‌ను ఏ ప్రభుత్వమైనా సరే పాటించాలి. అది ప్రభుత్వం తప్పనిసరి విధి. కానీ కక్ష కట్టి రాజకీయ పరంగా ప్రతిపక్ష పార్టీ ప్రజాప్రతినిధుల పేర్లను శిలాఫలకాల్లో ముద్రించకుండా అవమానిస్తోంది.

శిలాఫలకాల్లో కనిపించని వైవీ సుబ్బారెడ్డి పేరు..

రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి ప్రకాశం జిల్లాలో ప్రోటోకాల్ అమలు చేయాలని అధికారులను కోరారు. అయితే దీనిపై స్పందించని అధికారులు ప్రోటోకాల్ అమలు చేయకుండా అధికార పార్టీ నాయకుల చేతిలో కీలుబొమ్మలుగా మారారు. అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారధిగా ఉండాల్సిన ఉద్యోగులే రాజకీయ నాయకుల మాటలు వినడం సిగ్గు చేటు. ఒంగోలు మండలం , బొద్దులూరివారిపాలెం లో గ్రామంలో మొత్తం 14 పనుల నిమిత్తం, రూ.50 లక్షలతో అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణానికి, కొత్తపట్నం మండలం, గమళ్లపాలెం గ్రామంలో రూ.125 లక్షల అంతర్గత సిమెంట్ రోడ్ల నిర్మాణ శంకుస్థాపనకు సంబంధించిన శిలాఫలకంలో, ఒంగోలు మండలం, సర్వేరెడ్డిపాలెం గ్రామంలో మొత్తం 17 పనులకు గాను, రూ.70 లక్షలతో గ్రామంలో నిర్మిస్తున్న అంతర్గత సిమెంట్‌రోడ్ల నిర్మాణం శిలాఫలకంలో, కనిగిరి నియోజకవర్గంలోని బొమ్మిరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో రూ.80 లక్షలతో గార్లపేట-కూచిపూడి ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి గుండ్లపాలెం వెళ్లే రోడ్డుకు సిమెంట్ రోడ్డు నిర్మాణం శిలాఫలకంలోను, గిద్దలూరు నియోజకవర్గంలోని బేస్తవారిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని రూ.93 లక్షలతో పల్లెపండుగ మహోత్సవాల్లో భాగంగా నిర్మిస్తున్న సిమెంట్ రోడ్ల నిర్మాణం శిలాఫలకంలోనూ రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి పేరు లేకుండా శిలాఫలకాన్ని అధికారులు ఏర్పాటుచేసి తమ 'స్వామి' భక్తిని ప్రదర్శించారు. జిల్లా వ్యాప్తంగా అధికారులు చేపట్టిన పనులు, శిలాఫలకాలపై ప్రోటోకాల్ ను ఉల్లంఘిస్తూ అధికార కూటమి ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తుతున్నాయి.



గిద్దలూరు నియోజకవర్గంలో రాజ్యసభ సభ్యుని పేరులేని శిలాఫలకం



కనిగిరి నియోజకవర్గంలో శిలాఫలకంలో ప్రోటోకాల్ పాటించని అధికారులు





ఒంగోలు నియోజకవర్గంలో ప్రోటోకాల్ పాటించకుండా ఏర్పాటు చేసిన శిలాఫలకాలు

ఉత్సాహంగా టీసీఆర్ క్రికెట్ టోర్నమెంట్


- క్రికెట్ ఆడిన ఎమ్మెల్యే తాటిపర్తి



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే టీం

యర్రగొండపాలెం:

సంక్రాంతి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యం జరుగుతున్న టీసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఉత్సాహంగా సాగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులను ఉత్సాహ పరిచేందుకు ఎమ్మెల్యే ప్రత్యేక టీం ఏర్పాటు చేసి క్రికెట్ ఆడారు. 70 టీంలకు గాను ఇప్పటి వరకు 39 టీలు పోటాపోటీగా తలపడ్డాయి. 4వ రోజు జరిగిన టోర్నమెంట్‌లో త్రిపురాంతకం, గంజివారిపల్లె, రాజంపల్లి, సుంకేసుల, కొమరోలు, యర్రగొండపాలెంలోని మహమ్మద్ నూర్, అంబేడ్కర్ నగర్ జూనియర్స్, ఫ్రెడ్స్ లెవెన్, కుంట, మురారిపల్లె, గణపవరం, పుల్లలచెరువు-1, ఐనముక్కల టీంలు విజేతలుగా ముందుగు సాగుతున్నాయి. మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్‌గా శివారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ముక్కంటి, అంజి, గణేష్, చందు, ప్రవీణ్ నిలిచారు.



రక్తనాళ సంబంధిత వ్యాధుల నిపుణులు ఒంగోలు రాక
12 సంవత్సరాల అపార అనుభవము కలిగిన బృందం నుండి
డా. నరేంద్రనాద్ మేడా వారి వైద్య బృందం నుండి
డా॥ బి. విశాల్
MBBS, DNB, M.Ch, (Vascular Surgery, MMC, Chennai)
Consultant Vascular & Endovascular Surgeon
ఈ నెల తేది. 19-01-2025, ఆదివారం
ఉ॥ 10గం॥ నుండి సా॥ 4గం॥ వరకు అందుబాటులో ఉంటారు
KIMS HOSPITALS™
కిమ్స్ హాస్పిటల్
NH-5, నార్త్ బైపాస్ రోడ్డు, ఒంగోలు.
అపాయింట్‌మెంట్ కొరకు
08592 - 667788, 70958 78686

క్లుప్తంగా

వాహనాల తనిఖీలో 50 కేసులు నమోదు


డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు చేస్తున్న ఎస్సై అహరోన్

మార్కాపురం టౌన్: పట్టణంలో వాహనాలు తనిఖీ చేసిన పోలీసులు ఏకంగా 50 కేసులు నమోదు చేశారు. హెల్మెట్ లేకుండా, ట్రాఫిక్ రూల్స్ పాటించకుండా వాహనాలపై తిరుగుతున్న వారితో పాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కూడా కేసులు నమోదు చేశారు. వారందరి నుంచి జరిమానాలు వసూలు చేసినట్లు ట్రాఫిక్ ఎస్సై అహరోన్ తెలిపారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనాన్ని నడపాలని సూచించారు. తాగి వాహనం నడిపితే కచ్చితంగా జైలుకు పోవాల్సివస్తుందని హెచ్చరించారు.

ముగిసిన శ్రీగిరి ఉత్సవాలు


ఊంజలసేవలో శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీవారు

ఒంగోలు మెట్రో: ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న విశేష ఉత్సవాలు ఘనంగా ముగిసాయి. ఉత్సవాలలో భాగంగా శ్రీవారికి ఊంజల సేవను ఆలయ అర్చకులు, వేద పండితులు శోభాయమానంగా నిర్వహించారు. శ్రీగిరి ఆస్థాన సంగీత విద్వాంసుడు వీవీఎస్ వినోద్ కుమార్ ఆలపించిన అన్నమాచార్య భక్తి సంకీర్తనలు భక్తులకు ఆధ్యాత్మిక రసానందాన్ని పంచిపెట్టాయి. వెంకటేశ్వరస్వామికి తిరు వీధి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో శ్రీవారు తిరువీధులలో విహరించారు. స్వర్ణ సుబ్బారావు బృందం కోలాట ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వెంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీ కుమారి తదితరులతో పాటు ఆలూరు జై శంకర్ పర్యవేక్షించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

రాజకీయ పార్టీల కుట్రను తిప్పికొట్టండి


అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న మహాసభ నాయకులు

సంతనూతలపాడు: మాలలను అణచివేతకు గురిచేస్తున్న బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, ఇతర అన్ని రాజకీయ పార్టీల కుట్రలను తిప్పికొట్టాలని మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకటరావు పిలుపునిచ్చారు. మండలంలోని పేర్నమిట్టలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సమీక్ష సమావేశానికి అంబేడ్కర్ ఆశయ సమాజ్ జాతీయ అధ్యక్షుడు దండేల అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా మాల మహాసభ జాతీయ అధ్యక్షుడు, వర్గీకరణ వ్యతిరేక సుప్రీంకోర్టు న్యాయ పోరాట యోధుడు మల్లెల వెంకటరావు, ప్రొఫెసర్ జీవీ రత్నాకర్, దళిత సంఘాల జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చప్పిడి వెంగళరావు, సీనియర్ పాత్రికేయుడు నూకతోటి శరత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో అంబేడ్కర్ వాదులుగా పాలక పార్టీలను, ప్రభుత్వాలను ప్రశ్నిస్తూ పేద వర్గాల పక్షాన నిరంతరం పోరాటం చేస్తున్న మాలలను అణచివేయాలని బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కుట్ర పన్నాయన్నారు. వీరితో పాటు ఇతర రాజకీయ పార్టీల కుట్రలను కూడా ఎదుర్కోవాలని, అందుకు యూత్ ముందుండి పోరాటం చేయాలని కోరారు. అందులో భాగంగా ఫిబ్రవరి 15న చీమకుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో మాలల కళలు కర్ర సాము, మల్లయుద్ధం, కోలాటం, బుర్ర కథ మొదలగు 30 ప్రదర్శనలతో భారీ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మాలల సంస్కృతి సంప్రదాయాలతో జరుగుతున్న మాల కళల మహాజాతరను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ జాతరకు ప్రముఖులు తెలంగాణ ఎమ్మెల్సీ, కవి, గాయకుడు గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు జి.వివేక్, ఆర్.నాగరాజు, మాల గొంతుక రేంజర్ల రాజేష్, ఆవుల బాలనాథం, మాలల ఐక్యవేదిక అధ్యక్షుడు కృష్ణ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ షెషయ్య, దాసరి సుబ్బారావు, మాల యువసేన కార్యదర్శి నూకతోటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పకూలిన కూలీల కుటుంబాలు

- పొగాకు వచ్చాకు కొట్టేందుకు ట్రాక్టర్‌లో కూలీలు వెళ్తుండగా ప్రమాదం
- కమ్మీలు ఊడి కిందకు పడిపోయిన ట్రాక్టర్ డోర్
- డోర్‌పై కూర్చుని ఉన్న కూలీలు కిందపడి ఇద్దరు మృతి
- మరో ముగ్గురికి తీవ్రగాయాలు


మృతిచెందిన శ్రీనివాసులు


మృతిచెందిన చిన్న కాశయ్య


విలపిస్తున్న కాశయ్య కుటుంబ సభ్యులు

బేస్తవారిపేట: అకస్మాత్తుగా జరిగిన ప్రమాదంలో కూలి పనులు చేసుకుని జీవించే ఇద్దరు మృతిచెందడం, మరో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో వారితో పాటు వారిపై ఆధారపడిన కుటుంబాలు కూడా కుప్పకూలిపోయాయి. బేస్తవారిపేట మండలంలోని కలగొట్ల వద్ద గురువారం జరిగిన ఈ సంఘటన ఐదు కుటుంబాల్లో విషాదం నింపింది. బేస్తవారిపేట మండలంలోని పాత మల్లాపురంలో బాలగురవయ్య పొగాకు పంట సాగుచేశాడు. కూలి పనుల కోసం మార్కాపురం మండలంలోని భూపతిపల్లె ఎస్సీకాలనీ కూలీలను తెలిసినవాళ్లతో మాట్లాడుకున్నాడు. నాలుగు రోజుల నుంచి తెల్లవారుజామున వెళ్లి ట్రాక్టర్‌లో కూలీలను ఎక్కించుకుని పాతమల్లాపురం తీసుకొస్తున్నాడు. రోజూమాదిరిగానే గురువారం ఉదయం 5 గంటలకు ట్రాక్టర్‌లో 23 మంది కూలీలను ఎక్కించుకుని వెళ్తున్నాడు. ట్రాక్టర్ ట్రాలీ వెనుక డోర్ తెరిచి ఉంచగా, ఐదుగురు కూలీలు కాళ్లు కిందకు పెట్టుకుని డోర్‌పై కూర్చుని ప్రయాణిస్తున్నారు. మరో పది నిమిషాల్లో పొలం వద్దకు చేరాల్సి ఉంది. కలగొట్ల వద్దకు వెళ్లే సమయానికి ట్రాలీ వెనుక వైపున్న డోర్ కమ్మీలు ఊడిపోవడంతో డోర్ కిందకు పడిపోయింది. దానిపై కూర్చుని ఉన్న ఐదుగురు కూలీలైన మల్లాపురం శ్రీనివాసులు (57), ఎం.చిన్నకాశయ్య (56), మల్లాపురం బాలయ్య, సుబ్బారావు, ఎం.నాగేశ్వరరావు రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కొద్దిసేపటికే శ్రీనివాసులు, చిన్నకాశయ్య మృతిచెందారు. ట్రాక్టర్ వేగంగా వెళ్తుండటంతో వీరి తలలు రోడ్డుకు బలంగా తగిలి ప్రాణాలు పోయాయి. తీవ్రంగా గాయపడిన బాలయ్య, సుబ్బారావు, నాగేశ్వరరావును మార్కాపురం తరలించారు. మృతుడు శ్రీనివాసులుకు భార్య మరియమ్మ, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చిన్న కాశయ్యకు భార్య శారమ్మ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలతో ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణం మార్మోగింది. సమాచారం అందుకున్న భూపతిపల్లె గ్రామస్తులు భారీగా వైద్యశాల వద్దకు చేరుకున్నారు.

ఉన్నత చదువుల కోసం తపన...

ప్రమాదంలో మృతిచెందిన మల్లాపురం శ్రీనివాసులుకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ముగ్గురినీ ఉన్నత చదువులు చదివించాలని నిత్యం పరితపించేవాడు. ఇప్పుడు పిల్లలకు దిక్కులేకుండా పోయిందని కాలనీవాసులు కన్నీళ్లు పెట్టుకున్నారు. పెద్దమ్మాయి దీవెన డిగ్రీ పూర్తి చేసి ప్రస్తుతం ఎంబీఏ, రెండో అమ్మాయి శాలి నర్సింగ్ కోర్సు, మూడో కూతురు సుసన్న పదో తరగతి చదువుతున్నారు. కూలి పనులు చేసుకుంటూనే ముగ్గురు పిల్లలను బాగా చదివించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో తండ్రి మరణంతో వారి కుటుంబానికి తీరనిలోటు ఏర్పడింది. సమాచారం అందుకున్న ముగ్గురు పిల్లలు కంభం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చి బోరున విలపించారు. మాకు దిక్కెవరంటూ పిల్లలు కుమిలికుమిలి కన్నీటిపర్యంతమయ్యారు.

మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే అన్నా...

సమాచారం అందుకున్న గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా వెంకటరాంబాబు కంభం ప్రభుత్వ వైద్యశాలకు వచ్చారు. మృతుల కుటుంబాలను, క్షతగాత్రులను పరామర్శించారు. సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. డాక్టర్‌తో మాట్లాడి మృతదేహాలకు త్వరగా పోస్టుమార్టం పూర్తి చేయాలని సూచించారు. ఎస్సై ఎస్‌వీ రవీంద్రారెడ్డితో మాట్లాడి త్వరగా పీఎం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.


చిన్నకాశయ్య మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు


దిక్కుతోచని స్థితిలో ఉన్న ముగ్గురు కుమార్తెలు

ఉలిక్కిపడిన పాకల


పాకల తీరంలో సముద్రంలో గల్లంతైన వారిని ఒడ్డుకు తీసుకొచ్చి సీపీఆర్ చేస్తున్న పర్యాటకులు


పాకల తీరంలో భారీగా ఉన్న పర్యాటకులు

- తీరంలో విషాదం
- ముగ్గురు మృతి, ఒకరు గల్లంతు
- గతంలో ఎన్నడూ ఈ స్థాయి ప్రమాదం సంభవించలేదంటున్న మత్స్యకారులు
- బుధవారం ఇద్దరిని కాపాడిన మెరైన్ పోలీసులు

సింగరాయకొండ: ముక్కనుమ సందర్భంగా సరదాగా గడుపుదామని సముద్ర తీరానికి వచ్చిన పర్యాటకులు మృత్యువు బారిన పడటంతో వారి కుటుంబాలలో పెనువిషాదం మిగిలింది. గురువారం సింగరాయకొండ మండలం పాకల బీచ్‌లో జరిగిన ఈ సంఘటనతో పాకల, చుట్టుపక్కల ప్రాంతాలు ఉలిక్కిపడ్డాయి. ముక్కనుమ పండుగ సందర్భంగా పాకల బీచ్‌లో పర్యాటకుల రద్దీ అధికంగా ఉంది. ఒక్కరోజే చుట్టుపక్కల మండలాల ప్రజలు సుమారు 10 వేల మంది తరలివచ్చారు. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ సరదాగా తమ తోటి వారితో కలిసి కేరింతలు కొడుతూ సముద్రంలో మునుగుతూ సందడి చేశారు. ఆ సమయంలో తీరంలో ఒక్కసారిగా హాహాకారాలు మిన్నంటాయి. మా స్నేహితుడు కొట్టుకుపోతున్నాడు..కాపాడండి.. అంటూ తోటి స్నేహితులు, పర్యాటకుల కేకలు మిన్నంటడంతో అక్కడికి చేరుకున్న మెరైన్ పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. గల్లంతైన తమ్మిశెట్టి పవన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అదే సమయంలో అక్కడికి కొంచెం దూరంలో మరో ముగ్గురి మృతదేహాలు తేలియాడటాన్ని గమనించిన పర్యాటకులు వెంటనే వారిని తీరానికి చేర్చి సీపీఆర్ చేసినా ఫలితం దక్కలేదు.

తీరంలో ముక్కనుమ పండుగ సందర్భంగా పర్యాటకుల తాకిడి బాగా ఉంది. దూరప్రాంతాల నుంచి కార్లు, మోటారుసైకిళ్లలో వేల సంఖ్యలో పర్యాటకులు వచ్చారని మెరైన్ పోలీసులు తెలిపారు. బుధవారం కూడా రద్దీ విపరీతంగా ఉంది. సుమారు 15 వేల మందికిపైగా పర్యాటకులు వచ్చారని, కందుకూరుకు చెందిన ఇద్దరు గల్లంతయ్యేవారని, అదృష్టవశాత్తూ వారిని కాపాడగలిగామని తెలిపారు. కానీ, గురువారం ఒక్కసారిగా ముగ్గురు మృతిచెందడం, ఒకరు గల్లంతవ్వడం బాధాకరంగా ఉందని మెరైన్ పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఎప్పుడూ పాకల బీచ్‌లో ఈ స్థాయిలో మరణాలు సంభవించలేదని, మొట్టమొదటిసారిగా ఇంత పెద్ద ఘటన జరిగి ముగ్గురు మృతిచెందారని మత్స్యకారులు ఆందోళన చెందారు.

ఉసురుతీసిన ఈత సరదా


పాలేటి నీరజ్ మృతదేహం


పాలేటి నీరజ్ (ఫైల్)

- నీటి గుంతలో ఈతకు దిగి విద్యార్థి మృతి

పామూరు: ఈత సరదా ఓ విద్యార్థి ఉసురుతీయడంతో ఆ కుటుంబంలో విషాదం అలముకుంది. ఈ సంఘటన పామూరు మండలంలోని నుచ్చుపొదలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని నుచ్చుపొద గ్రామానికి చెందిన పాలేటి నీరజ్ (12) గురువారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలిసి గ్రామానికి దూరంగా ఉన్న పొలాల్లోకి రేగుపండ్లు కోసుకునేందుకు వెళ్లాడు. తిరిగి వస్తున్న సమయంలో నీరు నిల్వ ఉన్న గుంతను చూసిన నీరజ్.. తనకు ఈత వచ్చంటూ నీటి గుంతలో ఈత కొట్టేందుకు దిగాడు. ఎంతసేపటికీ నీరజ్ పైకి రాకపోవడంతో సహచర మిత్రులు సమీపంలోని పొలాల్లో ఉన్న వ్యక్తికి విషయం చెప్పి గుంటవద్దకు తీసుకొచ్చారు. ఆ రైతు, గ్రామస్తులు గుంటలోకి దిగి చూడగా, నీరజ్ అప్పటికే మృతి చెంది ఉన్నాడు. అప్పటిదాకా తమతో ఉన్న తమ కుమారుడు ఇలా మృత్యువాత పడటంతో తల్లి లీలావతి, తండ్రి మాధవ్ కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి తల్లి, తండ్రి, సోదరి ఉండగా స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. తల్లి లీలావతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కనిగిరి తరలించినట్లు ఎస్సై టి.కిషోర్‌బాబు తెలిపారు.

ఎన్‌టీఏ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్


డైరీ, క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) డైరీ, క్యాలెండరును కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకటరావు మాట్లాడుతూ విద్యాశాఖలో అమలవుతున్న జీఓ నంబరు 117ను వెంటనే రద్దు చేయాలన్నారు. 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రస్తుత హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులలో అర్హత కలిగిన వారికి పదోన్నతి కల్పించి వారిని జూనియర్ లెక్చరర్లుగా పరిగణించాలని కోరారు. ఉపాధ్యాయుల బదిలీల చట్టం రూపొందించేటప్పుడు కనిష్ఠ సర్వీసును రెండు అకడమిక్ సంవత్సరాలుగా, గరిష్ఠ సర్వీసును ఎనిమిది అకడమిక్ సంవత్సరాలుగా పరిగణిస్తే ఎక్కువ మందికి బదిలీ అవకాశం ఉంటుందని తెలిపారు. దీని వల్ల వివిధ హోదాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 2000–2023 మధ్యలో ప్రమోషన్ పొందిన గజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఉపయోగం ఉంటుందన్నారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బెజవాడ వెంకట నాగేశ్వరరావు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు ఆళ్ల రమేష్, ప్రధాన కార్యదర్శి సీహెచ్ నాగరాజు, ఎన్‌టీఏ క్రియాశీలక సభ్యులు గుండ్ల మధు, మాదాల కోటేశ్వరరావు, పి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

రామయోగితాత ఆరాధనోత్సవాలు ప్రారంభం




స్వామివారి జీవసమాధిని దర్శించుకుంటున్న భక్తులు

కురిచేడు: మండలంలోని పొట్లపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ గుత్తికొండ రామయోగితాత 114వ వార్షిక ఆరాధనోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు పొంగళ్లు చేసి స్వామివారికి నివేదించారు. సంతానం లేని మహిళలు, అనారోగ్యం ఉన్న మహిళలు స్వామివారి వద్ద వరపడ్డారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, అన్నదాన కార్యక్రమాలను ఆలయ కమిటీ నిర్వహించింది. రాత్రికి మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


పొంగళ్లు తయారు చేస్తున్న మహిళలు

నాలుగు కార్లు ఢీ


ఢీకొట్టుకున్న కార్లు

- తప్పిన పెను ప్రమాదం
- స్వల్ప గాయాలతో బయటపడిన ప్రయాణికులు

నాగులుప్పలపాడు: ముందు వెళ్తున్న కారు డ్రైవరు ఫోన్ మాట్లాడుతూ రోడ్డుపై ఉన్న బారికేడ్లు గమనించకపోవడంతో పాటు ఎదురుగా వస్తున్న వాహనానికి దారివ్వడానికి సడన్‌గా బ్రేకు వేయడంతో దాని వెనుక వస్తున్న మరో 3 కార్లు ఒకదానికొకటి ఢీకొట్టుకున్నాయి. మండల కేంద్రమైన నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్ ఎదురుగా 216వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు పోలీస్‌స్టేషన్ ఎదురుగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఏ వాహనమైనా అక్కడికి రాగానే నెమ్మదిగా వెళ్లాలి. అయితే, సంక్రాంతి పండుగకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఈ రహదారిపై సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదం జరిగింది. చీరాల వైపు నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న కారు డ్రైవర్ ఫోన్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న బారికేడ్లు గమనించకపోవడంతో పాటు ఒంగోలు నుంచి చీరాల వైపు వెళ్తున్న వాహనం రావడంతో సడన్‌గా బ్రేకు వేశాడు. దీంతో వెనుకనే వస్తున్న మరో కారు బలంగా ఢీకొట్టింది. అయినప్పటికీ ముందున్న కారు డ్రైవర్ గమనించకుండా వెళ్లిపోయాడు. అయితే, రెండో కారును దాని వెనుకే వస్తున్న మరో కారు, దానిని మరో కారు ఒక దానివెనుక మరొకటి మొత్తం నాలుగు కార్లు బలంగా ఢీకొనడంతో కారు భాగాలు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ వాటిలో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలు మినహా ఎలాంటి పెను ప్రమాదం జరగలేదు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. అయితే, ఈ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు చేరింది.

తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్యపోరు

- కారును అడ్డగించి మరీ దాడి
- ఫంక్షన్‌కు వెళ్లి వస్తున్న టీడీపీ నాయకులపై దాడి చేయగా, తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు

కురిచేడు: మండలంలోని తెలుగు తమ్ముళ్ల మధ్య ఆధిపత్యపోరు పురివిప్పింది. ఇప్పటికే గ్రూపు రాజకీయాలు చేస్తూ ఆధిపత్యం కోసం వారు పోరాడుతున్నారు. పార్టీ ఇచ్చే పదవులు తమ వర్గానికే చెందాలంటూ పట్టుబడుతున్నారు. కొన్ని సందర్భాలలో పార్టీ అగ్రనాయకులకు తలనొప్పిగా కూడా మారుతున్నారు. తాజాగా మండలంలోని పడమరనాయుడుపాలెం సమీపంలో బుధవారం రాత్రి టీడీపీ నాయకులపై జరిగిన దాడితో తెలుగు తమ్ముళ్లలో పంతాలు పరాకాష్టకు చేరాయని తెలుస్తోంది. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కాట్రాజు నాగరాజు మరో ఐదుగురితో కలిసి బుధవారం రాత్రి మండలంలోని పడమరనాయుడుపాలెం పంచాయతీ పరిధిలోని వీవై కాలనీలో ఓ ఫంక్షన్‌కు హాజరయ్యాడు. వారు తిరుగు ప్రయాణంలో పడమరనాయుడుపాలెం దాటగానే కొందరు ద్విచక్రవాహనాలపై వచ్చి కారును అడ్డగించారు. బూతులు తిడుతూ కారుపై దాడి చేశారు. ఇక్కడ పెత్తనం చేయడానికి మీరెవరురా అంటూ ఇష్టారీతిన కర్రలు, రాళ్లతో దాడి చేశారు. నాగరాజు కారును చాకచక్యంగా తప్పించి వెంటనే స్థానిక పోలీసుస్టేషనుకు చేరారు. ఈ దాడిలో కారులోని ఆరుగురిలో ఏ ఒక్కరికీ గాయాలు కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. అయితే, కారు అద్దాలు పగిలిపోయాయి. దాడిచేసిన వారిని అరెస్టు చేసి దాడికి గల కారణాలు వెలికితీయాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారు కూడా అధికార పార్టీకే చెందినవారు కావడంతో పోలీసులు కేసు నమోదు చేస్తారా.. లేకుంటే రాజీ చేస్తారా అని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. పోలీసులు ఏం చేస్తారో వేచిచూడాలి మరి.

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

- ప్రముఖ సెక్యూరిటీ సంస్థలో పని చేయుటకు అనుభవం కలిగిన సెక్యూరిటీ ఆఫీసర్స్ & హెడ్ గార్డ్స్, గార్డ్స్ కావలెను 12 గంటల డ్యూటీ, జీతం: 12000 టు 15000 రూమ్ & మీల్స్ ఫ్రీ. ప్రతి నెల 15 వ తేదీ జీతం. సంప్రదించండి. సెల్ 8464805330 [SCA25001175]
- ప్రముఖ MNC కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీలు పురుషులు కావలెను. అర్హత: 10th–డిగ్రీ, ఆకర్షణీయమైన జీతం వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించబడును. 9110256233, 7975935948 [G-9136]
- వాచ్‌మెన్ కావలెను. గుంటూరులోని కమర్షియల్ కాంప్లెక్స్ నందు పనిచేయుటకు 40సం॥ లోపు భార్యభర్తలు కావలెను. ఓ.సి.లకు ప్రాధాన్యత. గృహవసతి కలదు. ✆ 9849983681 [G-449]
- ప్రముఖ ఓవర్సీస్ కన్సల్టెన్సీ నందు పని చేయుటకు అనుభవం గల మహిళ టెలికాలర్స్ కావలెను. శాలరీ: 10k–15k, సంప్ర॥ VIP రోడ్డు, ఒంగోలు. 9118566669 [G-9139]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వివరాలకు సంప్రదించండి :
క్లాసిఫైడ్స్ :
ఒంగోలు
90102 02762